# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

MHR TV
www.MHRtv.com

మెదక్ | సంపుటి: 19 సంచిక: 12 | శనివారం, 13 సెప్టెంబర్ 2025 | పేజీలు: 06 వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamada-Vijayawada-Guntur-Vizag Adilabad Kurnool | www.prajaswaramdaily.com


## కోల్ ఇండియా ఉద్యోగులకు కేంద్రం శుభవార్త..

బొగ్గు గని రెగ్యులర్ కార్మికులకు కోటి రూపాయల అదనపు బీమా
కాంట్రాక్ట్ కార్మికులకు రూ. 40 లక్షల వరకు బీమా సౌకర్యం
స్వాతంత్ర్యం తర్వాత తొలిసారిగా ఉద్యోగులందరికీ డ్రెస్ కోడ్
రెగ్యులర్ ఉద్యోగులకు ఎక్స్‌గ్రేషియా రూ. 25 లక్షలకు పెంపు
సెప్టెంబర్ 17 నుంచి కొత్త ప్రయోజనాలు అమల్లోకి రానున్నాయి



**హైదరాబాద్ సెప్టెంబర్ 12(ప్రజాస్వరం):**
బొగ్గు గనుల్లో పనిచేసే కార్మికుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. కోల్ ఇండియాలో పని చేస్తున్న రెగ్యులర్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు భారీ ప్రయోజనాలు కల్పిస్తూ కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి శుక్రవారం కీలక ..మిగతా 2లో



2

# దక్షిణ భారత కుంభమేళగా పుష్కరాలు

### పుష్కరాలకు శాశ్వత ప్రాతిపదికన ఏర్పాట్లు చేయాలి

ముందస్తు ప్రణాళికలు తయారు చేయాలి
అధికారులంతా సమన్వయంతో పనిచేయాలి
గోదావరి పుష్కరాలపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష

## ఫలించిన ఎంపీ రఘునందన్ కృషి

మెదక్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీకి భారీ ఆర్డర్
ప్రధాని, రక్షణ మంత్రులకు రఘునందన్ కృతజ్ఞతలు
ఉద్యోగులు, కార్మికులకు శుభాకాంక్షలు తెలిపిన ఎంపీ
పారిశ్రామికంతో పాటు వ్యవసాయ అభివృద్ధికి కట్టుబాటు



**హైదరాబాద్ సెప్టెంబర్ 12(ప్రజాస్వరం):**
మెదక్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీకి భారీగా రూ.1119 కోట్ల రక్షణ ఆర్డర్ లభించింది. ఈ విజయాన్ని మెదక్ ఎంపీ రఘునందన్ రావు తన కృషి ఫలితమని పేర్కొన్నారు. కేంద్ర రక్షణ శాఖ తీసుకున్న ఈ నిర్ణయం పట్ల ఆయన ప్రధాని నరేంద్ర మోడీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, రక్షణ సహాయ మంత్రి సంజయ్ సేథ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. పటాన్‌చెరు అసెంబ్లీ నియోజకవర్గంలో ఉన్న ఈ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ బలోపేతం కోసం ..మిగతా 2లో

## సింగరేణి కాలరీస్ తెలంగాణ ఆత్మ..

ఎందరికో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించింది
సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి పెంచాల్సిన అవసరం ఉంది
కాపర్, గోల్డ్ గనుల వేలంలో సింగరేణి పాల్గొనింది
తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**
సెక్రటేరియట్ లో బొగ్గు బ్లాక్స్ వేలంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సింగరేణికి కలిగే ప్రయోజనాలు అంశంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బొగ్గు గనులకే పరిమితం కాకుండా ఇతర మినరల్స్ వేలంలో పాల్గొనాలని సింగరేణి బోర్డు నిర్ణయం తీసుకుంది.. సింగరేణి కాలరీస్ తెలంగాణ రాష్ట్రానికి ఆత్మ లాంటిదన్నారు. ఉద్యోగ గని సింగరేణి.. సింగరేణి కాలరీస్ ద్వారా ప్రజలకు ఉద్యోగ అవకాశాలు దొరుకుతున్నాయి.. దీని ద్వారా బ్రతకగలం అనే నమ్మకాన్ని కల్పిస్తుంది.. అదనపు గనులు రాకపోవడం వల్ల నష్టం జరుగుతుంది అన్నారు. ఇంకా గనులు పెంచుకోవాల్సిన అవసరం సింగరేణికి ఉంది అని ఉప ముఖ్యమంత్రి భట్టి పేర్కొన్నారు. ఇక, కాఫర్, గోల్డ్ గనుల వేలంలో సింగరేణి పాల్గొనింది అని డిప్యూటీ సీఎం భట్టి తెలిపారు. గనులు దక్కించుకుంది, లైసెన్స్ పొందింది.. రాయచూరులో ఉన్న గనుల్లో 37.7 శాతంతో సింగరేణి ఎక్స్ ప్లోర్ లైసెన్స్ పొందింది.. క్రిటికల్ మినరల్స్ లో కూడా సింగరేణి ప్రవేశించాలి.. అందుకోసం ఒక కన్సల్టెన్సీ కమిటీని ఏర్పాటు చేస్తున్నాం.. దేశంలో దొరికే మినరల్స్ పై పరిశీలన ..మిగతా 2లో



## యూరియాపై ఆందోళన వద్దు..

రైతులకు అవసరమైన ఎరువుల సరఫరా
ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం
రెండు రోజుల్లో రాష్ట్రానికి 23 వేల మెట్రిక్ టన్నులు
ఆర్ఎఫ్సీఎల్ పునరుద్ధరించేలా కేంద్రానికి ప్రతిపాదన
అధికారులతో మంత్రి తుమ్మల సమీక్ష



2

## యూరియా కష్టాలు కనిపించడం లేదా?

రైతులు అవస్థలు పడుతుంటే ఏం చేస్తున్నారు?
పైగా మీడియాపై కేసులు పెడతారా?
రైతుల కష్టాలను చూపిస్తే అణచివేతలా?
ఆంక్షలతో జర్నలిస్టులను భయపెట్టలేరు
ప్రభుత్వంపై హరీశ్ రావు ఫైర్



2


## వదిలే ప్రసక్తే లేదు.. సీబీఐకి ఫిర్యాదు చేస్తాం

అవినీతిని కట్టడి చేయకుంటే సింగరేణి భవన్ ను ముట్టడిస్తాం
రాబోయే సింగరేణి ఎన్నికల్లో హెచ్ఎంఎస్ దే విజయం
కార్మిక చట్టాలన్నీ అమలయ్యే వరకు పోరాటం
హెచ్ఎంఎస్, జాగృతి రెండు కళ్లలా పనిచేస్తాయి
టీజీబీకేఎస్ కు గెలిచే సీను లేదు
తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత



**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**
'సింగరేణిలో కాంగ్రెస్ అవినీతికి పాల్పడుతున్నారు.. ప్రతి కాంట్రాక్ట్ లో 25 శాతం అవినీతి జరుగుతోంది.. 10 శాతం వాటా కాంగ్రెస్ పెద్దలకు వెళ్తోంది.. ఈ అవినీతిని ఎట్టిపరిస్థితుల్లో అంగీకరించం.. అవినీతిపై చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం, సీఎంలను డిమాండ్ చేస్తున్నాం.. ప్రభుత్వం స్పందించకుంటే మేమే సీబీఐకి, కేంద్ర దర్యాప్తు సంస్థలకు ఫిర్యాదు చేస్తాం' అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. హైదరాబాద్ లోని బంజారాహిల్స్ లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో శుక్రవారం హెచ్ఎంఎస్ - సింగరేణి జాగృతి సంయుక్త సమావేశం(ఏబీ సింగరేణి మైనర్స్ అండ్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ కేంద్ర కార్యవర్గ సమావేశం) నిర్వహించారు. హెచ్ఎంఎస్ గౌరవాధ్యక్షురాలిగా ఎన్నికైన కవిత ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సింగరేణిలో అవినీతి రాజ్యమేలుతోందని ఆరోపించారు. సింగరేణిలో జరుగుతోన్న అవినీతికి వ్యతిరేకంగా హెచ్ఎంఎస్ ఆధ్వర్యంలో సింగరేణి భవన్ ను ముట్టడిస్తామని స్పష్టం చేశారు. త్వరలోనే జరగబోయే సింగరేణి గుర్తింపు ..మిగతా 2లో

## స్పీకర్ నిర్ణయంపై ఉత్కంఠ!



2

ఫిరాయింపు ఎమ్మెల్యేల సమాధానంపై ఏం చేయబోతున్నారు?
సంత్రృప్తి చెందుతారా?
వ్యక్తిగతంగా హాజరుకావాలని కోరతారా?
స్పీకర్ కోర్టుకు ప్రిపేర్ అవుతున్న బీఆర్ఎస్
మరిన్ని వివరాలను సేకరిస్తున్న గులాబీపార్టీ
ఈ నెల 14 వరకు స్పీకర్ గడువు ఇవ్వడంతో లీగల్ టీంతో స్టడీ
అవసరం అయితే మళ్లీ సుప్రీంకోర్టు వెళ్లేందుకు సన్నద్ధం
పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై వేటుపడేవరకు పోరాటం
విమర్శలకు పదును పెట్టిన బీఆర్ఎస్ నేతలు

# నడుస్తున్నది సర్కారా? సర్కసా?

యాకుత్‌పురా మ్యాన్‌హోల్ ఘటనపై కేటీఆర్ ఆగ్రహం
ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయ లోపం వల్లే ప్రమాదాలు అని ఆరోపణ
జీహెచ్ఎంసీ, హైడ్రా, జలమండలి ఒకరిపై ఒకరు నెపం నెట్టుకుంటున్నాయని వెల్లడి



2

## కోల్ ఇండియా ఉద్యోగులకు కేంద్రం శుభవార్త..

మొదటిపేజీ తరువాయి




ప్రకటన చేశారు. ఇందులో భాగంగా రెగ్యులర్ ఉద్యోగులకు కోటి రూపాయల అదనపు బీమా కవరేజీతో పాటు, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మొదటిసారిగా కార్మికులు, అధికారులందరికీ ఒకేరకమైన డ్రెస్ కోడ్ ప్రవేశపెట్టనున్నట్లు ఆయన తెలిపారు.

రాంచీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కిషన్ రెడ్డి మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పుట్టినరోజు, విశ్వకర్మ పూజను పురస్కరించుకుని ఈ సెప్టెంబర్ 17వ తేదీ నుంచి ఈ కొత్త పథకాలు అమల్లోకి వస్తాయని ఆయన స్పష్టం చేశారు. కొత్త నిబంధనల ప్రకారం, కోల్ ఇండియాలోని రెగ్యులర్ ఉద్యోగులకు కోటి రూపాయల అదనపు బీమా లభిస్తుందని, కాంట్రాక్ట్ కార్మికులకు రూ. 40 లక్షల వరకు బీమా వర్తిస్తుందని వివరించారు. దీంతో పాటు, రెగ్యులర్ ఉద్యోగులకు ఇచ్చే ఎక్స్‌గ్రేషియా మొత్తాన్ని రూ. 15 లక్షల నుంచి రూ. 25 లక్షలకు పెంచుతున్నట్లు ప్రకటించారు.

ఉద్యోగులకు గౌరవప్రదమైన గుర్తింపు ఇవ్వాలనే లక్ష్యంతో దేశంలోని అన్ని బొగ్గు గనుల్లో ఒకేరకమైన డ్రెస్ కోడ్ తీసుకువస్తున్నామని కిషన్ రెడ్డి అన్నారు. ఈ యూనిఫామ్‌లను కోల్ ఇండియా సంస్థే అందిస్తుందని, ఇది అధికారులకు కూడా వర్తిస్తుందని ఆయన పేర్కొన్నారు.

మోదీ ప్రభుత్వ హయాంలో బొగ్గు రంగం గణనీయమైన అభివృద్ధి సాధించిందని మంత్రి తెలిపారు. దేశంలో బొగ్గు ఉత్పత్తి మొదటిసారిగా ఒక బిలియన్ టన్నులు దాటిందని, దిగుమతులు తగ్గించుకోవడం ద్వారా గత ఆర్థిక సంవత్సరంలో రూ. 60,000 కోట్ల విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేశామని చెప్పారు. ప్రభుత్వం కేవలం బొగ్గుపైనే కాకుండా, కీలక ఖనిజాల అన్వేషణపై కూడా దృష్టి సారించిందని, ఇందుకోసం రూ. 32,000 కోట్లతో 'నేషనల్ క్రిటికల్ మినరల్స్ మిషన్' ప్రారంభించినట్లు ఆయన గుర్తుచేశారు. దేశంలో 74 శాతం విద్యుత్ థర్మల్ పవర్ నుంచే ఉత్పత్తి అవుతున్నందున, ఇంధన భద్రతకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని ఆయన స్పష్టం చేశారు.

## ఫలించిన ఎంపీ రఘునందన్ కృషి

మొదటిపేజీ తరువాయి



తాను ఎంపీగా గెలిచినప్పటి నుంచి నిరంతరం కృషి చేస్తున్నానని రఘునందన్ రావు గుర్తు చేశారు. అధికారులు, ఉద్యోగులు, కార్మికులతో అనేకసార్లు సమావేశాలు నిర్వహించి, సమస్యలపై కేంద్రానికి విజ్ఞప్తులు సమర్పించిన విషయాన్ని ఆయన వివరించారు. అలాగే, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, సహాయ మంత్రి సంజయ్ సేథ్‌లను అనేకసార్లు కలసి ప్రతిపాదనలు సమర్పించానని తెలిపారు. దీనికి స్పందించిన కేంద్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ ఫ్యాక్టరీకి పెద్ద ఎత్తున ఆర్డర్ మంజూరు చేయడం ఆనందదాయకమని పేర్కొన్నారు. ఈ ఆర్డర్ వల్ల ఫ్యాక్టరీ ఉద్యోగులు, కార్మికులు మరింత ఉత్సాహంతో ముందుకు సాగుతారని రఘునందన్ రావు అన్నారు. మెదక్ ప్రజల ఆశీర్వాదంతో గెలిచిన తాను అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తానని, పారిశ్రామిక అభివృద్ధితో పాటు వ్యవసాయ రంగానికీ సమాన ప్రాధాన్యత ఇస్తానని ఆయన స్పష్టం చేశారు.

## వదిలే ప్రసక్తే లేదు.. సీబీఐకి ఫిర్యాదు చేస్తాం

మొదటిపేజీ తరువాయి

సంఘం ఎన్నికల్లో కార్మికుల విశ్వాసం పొంది హెచ్ఎంఎస్ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్మికుల హక్కుల కోసం పనిచేస్తానని హామీ ఇచ్చారు. టీబీజీకేఎస్ అనేది మొన్న ఎన్నికల్లో పోటీనే చేయలేదని, గుర్తింపు సంఘం అనుకుంటున్న వాళ్లు వాపును చూసి బలుపు అనుకుంటున్నారని, నిజానికి సింగరేణి ఎన్నికల్లో వాళ్లకు గెలిచే అంతా సీన్ లేదన్నారు. అప్పుడు ఉన్న పొలిటికల్ సిచ్యువేషన్ కారణంగా ఆ పరిస్థితి వచ్చిందని వెల్లడించారు. సింగరేణిలో ఇప్పుడున్న ఎర్రజెండా కాకుండా మరొక జెండా ముందుకు రాబోతోందని, హెచ్ఎంఎస్, జాగృతి సంస్థలు మొత్తం 40 వేల మంది సింగరేణి కార్మికుల కోసం పనిచేస్తాయన్నారు. కార్మిక చట్టాలన్నీ అమలయ్యేలా మనం పోరాటం చేద్దామని పిలుపు నిచ్చారు.

గతంలో కేసీఆర్ చెప్పారనే టీబీజీకేఎస్ కు ఓటు వేశారని, సంఘం గౌరవాధ్యక్షురాలిగా నేను కార్మికుల సమస్యలపై స్టడీ చేసి కేసీఆర్ తో మాట్లాడి వాటిని పరిష్కరించానన్నారు. కేసీఆర్ ఇప్పుడు అధికారంలో లేరు.. సింగరేణిలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఇప్పుడున్న టీబీజీకేఎస్ నాయకులు ఎందుకు పోరాటం చేయటం లేదో కార్మికులకు, తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రతిక్షణం కార్మికుల కోసం ఫీల్డ్ లో ఉండి పనిచేసే వారే కార్మిక సంఘం గెలుస్తారన్నారు. టీబీజీకేఎస్ నాయకులు అవినీతి చేయొద్దని గతంలో నేను ఎన్నోసార్లు చెప్పాను.. అయినా నాయకులు స్వార్థంతో అవినీతి చేశారన్నారు. కార్మిక సంఘాల్లో యువతను ప్రోత్సహించాలని కోరినా పట్టించుకోలేదని మండిపడ్డారు. కేసీఆర్ సింగరేణి సంస్థను కన్నబిడ్డలా చూసుకున్నారు.. వారి మార్గంలోనే హెచ్ఎంఎస్ కూడా పనిచేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వారి తీరుకు వ్యతిరేకంగా కొట్లాడుదాం అన్నారు. సింగరేణిలో వారసత్వ ఉద్యోగాలను తగ్గించేందుకు కొత్త కొర్రీలు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఉన్న మైన్స్, మినరల్స్ ను వినియోగించుకొని ప్రభుత్వం కొత్త ఉద్యోగాలు సృష్టించాలన్నారు. సింగరేణి ప్రాంత ప్రజలకు దక్కాల్సిన నిధులను దారి మళ్లిస్తున్నారన్నారు. లాభాల్లో ఉన్న సింగరేణి సంస్థకు కాంగ్రెస్ ప్రభుత్వం 42 వేల కోట్ల బకాయిలు పెట్టి నష్టాల్లోకి నెట్టేస్తోందని, ఇలా చేస్తే సంస్థ భవిష్యత్ ఏం కావాలి? అని ప్రశ్నించారు. సింగరేణి ఎన్నికల్లో గెలవబోయేది మనమేనని, మహిళ కార్మికుల సంక్షేమం, వారి వసతుల కోసం కూడా పోరాటం చేద్దామన్నారు. హెచ్ఎంఎస్ లో సభ్యత్యాలు పెంచాలని, ట్రైనింగ్ ప్రోగ్రామ్స్ కూడా నిర్వహిద్దామన్నారు. హెచ్ఎంఎస్, జాగృతి రెండు కళ్లలా పనిచేస్తాయని తెలిపారు. హెచ్ఎంఎస్, జాగృతి కొత్త కాంబినేషన్.. అదే విన్నింగ్ కాంబినేషన్ కాబోతుందని ధీమా వ్యక్తం చేశారు.

## నడుస్తున్నది సర్కారా? సర్కసా?

- యాకుత్‌పురా మ్యాన్‌హోల్ ఘటనపై కేటీఆర్ ఆగ్రహం
- ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయ లోపం వల్లే ప్రమాదాలు అని ఆరోపణ
- జీహెచ్ఎంసీ, హైడ్రా, జలమండలి ఒకరిపై ఒకరు నెపం నెట్టుకుంటున్నాయని వెల్లడి




**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. హైదరాబాద్‌లోని యాకుత్‌పురాలో తెరిచి ఉంచిన మ్యాన్‌హోల్‌లో చిన్నారి పడిపోయిన ఘటనను ప్రస్తావిస్తూ, ఇది ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడ్డారు. ప్రభుత్వాన్ని నడుపుతున్నారా? లేక సర్కస్ నడుపుతున్నారా? అని ఆయన ఘాటుగా ప్రశ్నించారు.

యాకుత్‌పురాలో జరిగిన ఘటనలో అదృష్టవశాత్తూ పాప ప్రాణాలతో బయటపడిందని, లేదంటే ఆ కుటుంబానికి తీరని శోకం మిగిలేదని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదం జరిగిన తర్వాత తప్పును సరిదిద్దుకోవాల్సిన ప్రభుత్వ శాఖలు, ఒకరిపై ఒకరు నిందలు వేసుకోవడం దారుణమని అన్నారు. జీహెచ్ఎంసీ వారు ఇది హైడ్రా తప్పంటే, వారు అది జలమండలి పొరపాటని చేతులు దులుపుకున్నారని తెలిపారు. అసలు తమకు సంబంధమే లేదని జలమండలి ప్రకటించిందని ఆయన పేర్కొన్నారు.

మున్సిపల్ శాఖలోని మూడు కీలక విభాగాల మధ్య సమన్వయం పూర్తిగా కొరవడిందని కేటీఆర్ ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి కేవలం కాసుల వేటపైనే దృష్టి పెట్టారని, పరిపాలనను గాలికొదిలేశారని విమర్శించారు. శాఖల మధ్య సమన్వయ లోపం వల్ల నగర ప్రజలు ప్రత్యక్ష నరకాన్ని చూస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

# స్పీకర్ నిర్ణయంపై ఉత్కంఠ!

- ఫిరాయింపు ఎమ్మెల్యేల సమాధానంపై ఏం చేయబోతున్నారు?
- సంతృప్తి చెందుతారా? వ్యక్తిగతంగా హాజరుకావాలని కోరతారా?
- స్పీకర్ కోర్టుకు ప్రిపేర్ అవుతున్న బీఆర్ఎస్
- మరిన్ని వివరాలను సేకరిస్తున్న గులాబీపార్టీ
- ఈ నెల 14 వరకు స్పీకర్ గడువు ఇవ్వడంతో లీగల్ టీంతో స్టడీ
- అవసరం అయితే మళ్లీ సుప్రీంకోర్టు వెళ్లేందుకు సన్నద్ధం
- పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై వేటుపడేవరకు పోరాటం
- విమర్శలకు పదును పెట్టిన బీఆర్ఎస్ నేతలు



**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

ఫిరాయింపుల ఎమ్మెల్యేలపై స్పీకర్ ఏం నిర్ణయం తీసుకుంటారనేది ఇప్పుడు రాజకీయ వర్గాలతో పాటు ప్రజల్లోనూ ఉత్కంఠ నెలకొంది. తాము పార్టీ మారలేదని, బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నామని బీఆర్ఎస్ పార్టీ బీఫాంపై గెలిచి కాంగ్రెస్ కు వెళ్లిన ఎమ్మెల్యేలు స్పీకర్ కు వివరణ ఇచ్చారు. ఆ వివరణ పత్రాలను బీఆర్ఎస్ పార్టీ నుంచి కోర్టుకు వెళ్లిన ఎమ్మెల్యేలు కేపీ వివేకానందగౌడ్, కౌశిక్ రెడ్డికి స్పీకర్ పంపారు. ఈ నెల 14లోగా రిప్లై ఇవ్వాలని స్పీకర్ సూచించారు. అయితే ఫిరాయింపు ఎమ్మెల్యేలు ఇచ్చిన వివరణ కాపీలపై బీఆర్ఎస్ న్యాయవాదులతో కసరత్తు చేస్తున్నారు. ఎలా ముందుకెళ్లాలనేదానిపై న్యాయ నిపుణుల సలహాలు సైతం తీసుకుంటున్నారు.

ప్రస్తుతం స్పీకర్ బెంగుళూరులో జరుగుతున్న 11వ కామన్వెల్త్ పార్లమెంట్ అసిసియేషన్ ఇండియా రీజియన్ కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ నెల 14వరకు కాన్ఫరెన్స్ కొనసాగనున్నది. అయితే స్పీకర్ వచ్చిన తర్వాత ఎలాంటి నిర్ణయం తీసుకోబోతున్నారనేది ఇప్పడు హాట్ టాపిక్ అయింది. ఫిరాయింపు ఎమ్మెల్యేలు ఇచ్చిన వివరణకు స్పీకర్ సంతృప్తి చెందుతారా? లేదా? అనేది కూడా చర్చమొదలైంది. వ్యక్తిగతంగా ఫిరాయింపులు ఎమ్మెల్యేలు హాజరు అయి వివరణ ఇవ్వాలని కోరతారా? అనేది కూడా చర్చకు దారితీసింది. మరోవైపు బీఆర్ఎస్ నుంచి కూడా స్పీకర్ కోర్టులో విచారించనున్నారు. అందుకు న్యాయవాదులు వాదనాలు వినిపించేందుకు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. బీఆర్ఎస్ మరోసారి ఫిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్యేలు పార్లమెంట్ ఎన్నికల్లో చేసిన ప్రచారం, అందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలతో పాటు కాంగ్రెస్ సమావేశాల్లో పాల్గొన్న ఫొటోలు, కండువాలు కప్పిన పొటోలను, తాజాగా చేసిన కొన్ని వ్యాఖ్యలకు వీడియోలను సేకరిస్తున్నారు. స్పీకర్ ముందు మరోసారి ఉంచాలని బీఆర్ఎస్ భావిస్తుంది. ఒకవేళ స్పీకర్ దగ్గర సంతృప్తి చెందక పోతే మరోసారి సుప్రీంకోర్టుకు వెళ్లేందుకు కూడా సిద్ధమవుతున్నట్లు పార్టీ నేతలు తెలిపారు. స్పీకర్ విచారణ షెడ్యూల్ ఇంకా రాలేదని, వచ్చిన వెంటనే వాదనలు వినిపిస్తామన్నారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై వేటుపడేవరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

**విమర్శలకు పదునుపెట్టిన బీఆర్ఎస్**

బీఆర్ఎస్ పార్టీ విమర్శలకు పదును పెట్టింది. ఫిరాయింపులు ఎమ్మెల్యేలు పార్టీ మారలేదని స్పీకర్ కు సమాధానంలో చెప్పడం సిగ్గుచేటని విమర్శలు గుప్పించారు. రేవంత్ ను కలిసింది కేవలం నియోజకవర్గ అభివృద్ధి కోసం అంటే ప్రజలు నమ్ముతారా..? రేవంత్ కప్పింది పార్టీ జెండా కాదు.. జాతీయ జెండా అని చెప్పడం హాస్యాస్పదం అని మండిపడుతున్నారు. జాతీయ జెండాను అవహేళన చేయడం సరికాదని, దొంగతనం చేసి తప్పించుకోలేని స్థితిలో ఎమ్మెల్యేలు ఉన్నారని, ఇప్పటికే పార్టీ విశ్వాసం కోల్పోయారన్నారు. నమ్మిన పార్టీకి, ప్రజలకు ద్రోహం చేసిన ఎమ్మెల్యేలను ప్రజలు క్షమించరు..కోట్లాది మంది ప్రజలకు గంతలు కట్టే ప్రయత్నం చేస్తున్నారని తీవ్ర విమర్శలు చేస్తున్నారు. వాళ్ళను డిస్కాలిఫై చేయడం ఖాయం ఖాయమని, పార్టీ మారిన 10 సెగ్మెంట్లలో ఉప ఎన్నికలు రావడం.. ప్రజలు తగిన బుద్ధి చెప్పడం ఖాయమని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

**అసెంబ్లీ రికార్డులో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే**

బీఆర్ఎస్ పార్టీ బీఫాంపై గెలిచిన పది మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ లో చేరారు. దాదాపు ఏడాదిన్నర అవుతున్నా అసెంబ్లీ రికార్డుల్లో మాత్రం ఇంకా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గానే ఉన్నారు. అసెంబ్లీ బయట కాంగ్రెస్ ఎమ్మెల్యేలుగా చెలామణి అవుతూ.. అసెంబ్లీ రికార్డుల్లో మాత్రం బీఆర్ఎస్ ఎమ్మెల్యేగానే ఉన్నారు. బీఆర్ఎస్ నేతలు సైతం పలు సందర్భాల్లో 38మంది ఎమ్మెల్యేలు ఉన్నా సంఖ్యకు అనుగుణంగా మాట్లాడేందుకు సమయం ఇవ్వాలని అసెంబ్లీలో కోరుతున్న సందర్భాలు ఉన్నాయి. తాజాగా అసెంబ్లీ సమావేశాల్లోనూ తమ సంఖ్య 38 మంది అని అందుకు తగిన విధంగా మాట్లాడే అవకాశం ఇవ్వాలని కోరడం ఇప్పుడు హాట్ టాపిక్ అయింది. అంతేకాదు గన్ పార్కు వద్ద నిరసన చేపట్టిన సందర్భంలోనూ ఇదే వ్యాఖ్యలు చేశారు. వీటన్నింటిని స్పీకర్ పరిగణలోకి తీసుకుంటారా? కేవలం ఫిరాయింపు ఎమ్మెల్యేల వివరణపైనే విచారణ చేస్తారా అనేది చూడాలి.



## యూరియాపై ఆందోళన వద్దు..

- రైతులకు అవసరమైన ఎరువుల సరఫరా
- ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం
- రెండు రోజుల్లో రాష్ట్రానికి 23 వేల మెట్రిక్ టన్నులు
- ఆర్ఎఫ్సీఎల్ పునరుద్ధరించేలా కేంద్రానికి ప్రతిపాదన
- అధికారులతో మంత్రి తుమ్మల సమీక్ష

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

రాష్ట్రంలోని రైతులకు అవసరమైన ఎరువుల సరఫరా నిరంతరంగా కొనసాగించడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నదని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సచివాలయంలో శుక్రవారం యూరియా సరఫరాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలోని ఆర్ఎఫ్సీఎల్ ఎరువుల కర్మాగారాన్ని తిరిగి పునరుద్ధరించేలా మరోసారి కేంద్రాన్ని కోరాలని ఆదేశించారు. రాష్ట్రానికి శుక్రవారం 11,930 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా అయిందన్నారు. గత రెండు రోజులలో 23 వేల మెట్రిక్ టన్నులు యూరియా వచ్చిందని, మరో 4 రోజుల్లో 27,650 మెట్రిక్ టన్నుల యూరియా రానున్నదని వెల్లడించారు. రైతులకు ఎరువుల పంపిణీ అంతరాయం లేకుండా ఉండేందుకు రైతు వేదికలలో కూడా సేల్స్ పాయింట్లు ఏర్పాటు చేయాలని మరోసారి జిల్లా అధికారులను ఆదేశించారు. వ్యవసాయ శాఖ సెక్రెటరీ రఘునందన్ రావు, డైరెక్టర్ గోపీ ఈ సమీక్షలో పాల్గొన్నారు.

**ఇక్రిశాట్‌తో కలిసి పని చేస్తాం..**

వ్యవసాయ అభివృద్ధికి ఇక్రిశాట్‌తో కలిసి పని చేయడానికి సిద్ధంగా ఉన్నామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సచివాలయంలో ఇక్రిశాట్ ప్రతినిధులతో భేటీ అయ్యారు. చిక్కుళ్ళు, తృణధాన్యాల మెరుగైన రకాలతో పాటు, వివిధ పంటలలో తాము అమలు చేస్తున్న వ్యవసాయ సాంకేతిక పద్ధతులను వారు వివరించారు. ఇక్రిశాట్ సహకారాన్ని బలోపేతం చేయడం ద్వారా రాష్ట్రంలో వ్యవసాయ రంగం మరింతగా ఎలా అభివృద్ధి చెందుతుందనే దానిపై చర్చించారు. తెలంగాణలో వ్యవసాయ రంగం అభివృద్ధి చెందడానికి అవసరమైన సాంకేతిక సహకారాన్ని అందిస్తామని ఇక్రిశాట్ ప్రతినిధులు తెలిపారు. డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ స్టాన్‌ఫోర్డ్ బ్లేడ్, జనరల్ రీసెర్చ్ డాక్టర్ హరి కిషన్ ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## యూరియా కష్టాలు కనిపించడం లేదా?

- రైతులు అవస్థలు పడుతుంటే ఏం చేస్తున్నారు?
- పైగా మీడియాపై కేసులు పెడతారా?
- రైతుల కష్టాలను చూపిస్తే అణచివేతలా?
- ఆంక్షలతో జర్నలిస్టులను భయపెట్టలేరు
- ప్రభుత్వంపై హరీశ్ రావు ఫైర్

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**



రైతుల యూరియా కష్టాలను ప్రసారం చేస్తున్న మీడియాపై కేసులు పెడతారా అంటూ మాజీ మంత్రి హరీశ్ రావు ఫైరయ్యారు. అణచివేతలు, ఆంక్షలతో జర్నలిస్టులను భయపెట్టలేరని మండిపడ్డారు. రైతులు పడుతున్న యూరియా కష్టాలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చేందుకు ప్రయత్నించిన ఓ జర్నలిస్టుపై పోలీసులు అక్రమ కేసులు బనాయించడం దుర్మార్గమని అన్నారు. ఎక్స్ వేదికగా హరీశ్ రావు శుక్రవారం ప్రభుత్వంపై ఫైర్ అయ్యారు. రైతుల సమస్యలను తెలుసుకునేందుకు వెళ్లిన జర్నలిస్టుపై పోలీసులు ఉల్టా కేసులు పెట్టడం రాష్ట్ర ప్రభుత్వ నిరంకుశ పాలనకు నిదర్శనం అన్నారు. గడిచిన 2 నెలలుగా రైతులు యూరియా కోసం అష్టకష్టాలు పడుతుంటే పట్టించుకోని ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎత్తి చూపుతున్న మీడియాపై కేసులు పెట్టడం శోచనీయం అంటూ మండిపడ్డారు. శాంతిభద్రతల నిర్వహణను పక్కన పెట్టి ప్రజల గొంతు నొక్కేందుకు పోలీసులను వాడడం అప్రజాస్వామికం అన్నారు. జర్నలిస్ట్‌పై పెట్టిన కేసులను తక్షణం ఉపసంహరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, డీజీపీని డిమాండ్ చేశారు.

**ఇది అత్యంత దుర్మార్గం**

మధ్యాహ్న భోజన పథకం కార్మికులపై ప్రభుత్వం కర్కశంగా, కఠినంగా వ్యవహరించడం అత్యంత దుర్మార్గమని హరీశ్ రావు మండిపడ్డారు. శుక్రవారం మధ్యాహ్న భోజన కార్మికులు ఆయన్ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పెండింగ్ బిల్లులు, వేతనాల కోసం కార్మికులు రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు, నిరసనలు చేస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్ర నటిస్తుండడం దారుణమన్నారు. ఎన్నికల సమయంలో వేతనాలు పెంచుతామని నమ్మించి, ఇప్పుడు నయవంచన చేయడం ద్రోహం చేయడమే అవుతుందని విమర్శించారు. ఉన్నఫలంగా మధ్యాహ్న భోజన పథకం నుంచి దూరం చేస్తే 20 ఏండ్లుగా పని చేస్తున్న కార్మికుల పరిస్థితి ఏం కావాలి అని ప్రశ్నించారు. ఏడాది కాలంగా బిల్లులు చెల్లించకపోవడంతో అప్పులు చేసి మరీ విద్యార్థులకు భోజనాలు పెట్టిన ఆ చిరు ఉద్యోగుల ఆర్థిక భారం ఎవరు తీర్చాలి అని అడిగారు. ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం వల్ల మధ్యాహ్న భోజన కార్మికుల బతుకులు రోడ్డున పడే ప్రమాదం ఉందన్న విషయాన్ని గుర్తించాలని ప్రభుత్వాన్ని కోరారు. పెండింగ్ బిల్లులు, వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

## దక్షిణ భారత కుంభమేళగా పుష్కరాలు

- పుష్కరాలకు శాశ్వత ప్రాతిపదికన ఏర్పాట్లు చేయాలి
- ముందస్తు ప్రణాళికలు తయారు చేయాలి
- అధికారులంతా సమన్వయంతో పనిచేయాలి
- గోదావరి పుష్కరాలపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష



**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

గోదావరి పుష్కరాల ఏర్పాట్లు, ముందస్తు సన్నద్ధతపై శుక్రవారం కమాండ్ కంట్రోల్ సెంటర్లో సీఎం రేవంత్ రెడ్డి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎంతో పాటు మంత్రి కొండా సురేఖ, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రి, ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి శ్రీనివాసరాజు, ధార్మిక సలహాదారు గోవింద హరి తదితరులు పాల్గొన్నారు. ఇక, గోదావరి పుష్కరాలను దక్షిణ భారత కుంభమేళాగా ఘనంగా నిర్వహించేందుకు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గోదావరి పుష్కరాలకు శాశ్వత ప్రాతిపదికన ఏర్పాట్లు చేయాలన్నారు. అందుకు అవసరమైన ముందస్తు ప్రణాళికలు తయారు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. అలాగే, రాష్ట్రంలో గోదావరి తీరం వెంట ఉన్న ప్రధాన ఆలయాల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. దీంతో పాటు పుష్కరాల ఏర్పాట్లు, రాబోయే భక్తుల రద్దీని అంచనా వేసుకొని మౌలిక వసతులు కల్పించాలన్నారు. పుష్కర స్నానాలు ఆచరించేందుకు వచ్చే లక్షలాది భక్తులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా తగిన సదుపాయాలు కల్పించేందుకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు సీఎం రేవంత్ రెడ్డి. అయితే, 2027లో జులై 23వ తేదీ నుంచి గోదావరి పుష్కరాలు ప్రారంభమవుతాయి. ఇప్పటి నుంచి దాదాపు 22 నెలల వ్యవధి ఉన్నందున శాశ్వతమైన మౌలిక వసతులు, అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మహారాష్ట్ర నుంచి తెలంగాణలో ప్రవేశించే గోదావరి నదికి రాష్ట్రంలో 560 కిలోమీటర్ల తీర ప్రాంతముంది. దాదాపు 74 చోట్ల పుష్కర ఘాట్లను ఏర్పాటు చేయాల్సిన అవసరముంటుందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. కాగా, బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి తీరం వెంట ఉన్న ధర్మపురి, కాళేశ్వరంతో పాటు అన్ని ప్రధాన ఆలయాలను మొదటగా అభివృద్ధి చేయాలన్నారు ముఖ్యమంత్రి రేవంత్. ఇక, ప్రధాన ఆలయాల దగ్గర భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది, ఆలయ పరిసరాల్లోని పుష్కర ఘాట్ల అభివృద్ధికి మొదటి ప్రాధాన్యంగా ఎంచుకోవాలన్నారు. ఆలయ అభివృద్ధితో పాటు అక్కడ శాశ్వత పుష్కర ఘాట్ల నిర్మాణం చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. అలాగే, రెండో ప్రాధాన్యంగా పుష్కర స్నానాలకు వీలుగా ఉండే గోదావరి తీర ప్రాంతాలను అభివృద్ధి చేయాలి.. ఒకే రోజు రెండు లక్షల మంది భక్తులు పుష్కర ఘాట్లకు తరలి వచ్చినా ఇబ్బంది లేకుండా రోడ్లు, రహదారుల నిర్మాణంతో పాటు వాహనాల పార్కింగ్, తాగు నీరుతో పాటు భక్తులకు అవసరమైన వసతులన్నీ ఉండేలా ప్లాన్ చేసుకోవాలన్నారు. అలాగే, మహా కుంభమేళాతో పాటు గతంలో వివిధ రాష్ట్రాల్లో పుష్కరాలు, ఆలయాల అభివృద్ధి, భక్తులకు అవసరమైన సౌకర్యాల రూపకల్పనలో అనుభవమున్న కన్సల్టెన్సీలను నియమించుకోవాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. బాసర, కాళేశ్వరం, ధర్మపురి, భద్రాచలంతో పాటు గోదావరి తీరం వెంట ఉన్న అన్ని ఆలయాలన్నింటినీ సందర్శించి విడివిడిగా ప్రాజెక్టు రిపోర్టులు సిద్ధం చేయాలన్నారు. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఆలయాల అభివృద్ధికి డిజైన్లు రూపొందించాలన్నారు. ఇక, పుష్కరాల ఏర్పాట్లకు కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. కాగా, స్వచ్ఛ భారత్, జల్ జీవన్ మిషన్ తో పాటు అందుబాటులో ఉన్న కేంద్ర పథకాలన్నింటితో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. వాటికి అవసరమైన అనుమతులు తీసుకోవాలన్నారు. దక్షిణ భారత కుంభమేళాకు వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని కేంద్రం నుంచి స్పెషల్ ప్యాకేజీ కోరేందుకు వీలుగా ఈ పనుల జాబితాను సిద్ధం చేయాలని చెప్పారు. పుష్కరాల నిర్వహణకు ముందస్తు ఏర్పాట్లలో పర్యాటక శాఖ, నీటి పారుదల శాఖ, దేవాదాయ శాఖ సమన్వయంతో పని చేయాలని రేవంత్ రెడ్డి అన్నారు.

## సింగరేణి కాలరీస్ తెలంగాణ ఆత్మ..

మొదటిపేజీ తరువాయి

చేసి నివేదిక అందిస్తుంది.. గ్రీన్ ఎనర్జీపై కూడా సింగరేణి దృష్టి పెట్టింది.. ఫ్లోటింగ్ సోలార్ ఇప్పటికే పెట్టింది.. గ్రీన్ హైడ్రోజన్ పై కూడా దృష్టి సారిస్తుంది.. త్వరలోనే సింగరేణి సంస్థ గ్లోబల్ కాబోతోంది.. వేలంలో పాల్గొనకపోవడం వల్ల సంస్థకు నష్టం జరుగుతుందని కార్మిక సంఘాలు వినతిపత్రం సమర్పించాయి.. బొగ్గు బ్లాక్స్ వేలంతో.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సింగరేణికి కలిగే ప్రయోజనాలు అనే అంశంపై సీఎండీ బలరాం ప్రజెంటేషన్ ఇస్తున్నారని ఉప ముఖ్యమంత్రి విక్రమార్క వెల్లడించారు.



# ప్రజా పాలనలో ప్రజల ప్రభుత్వం





- అభివృద్ధి అవసరాలు, యోగ క్షేమాలు తీర్చడమే లక్ష్యం
- మెదక్ సుందరీకరణ పనులు వేగవంతం చేయాలి
- ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు

**మెదక్, సెప్టెంబర్ 12, (ప్రజా స్వరం) :**
జిల్లాలో భారీ వర్షాలు వరదల కారణంగా దెబ్బతిన్న రోడ్లు కల్వర్టులు కాజ్వేలు, చెరువులు, తాత్కాలికంగా చేపడుతున్న పనులు, శాశ్వతంగా చేపట్టే పనులపై జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తో కలిసి ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్, ఇరిగేషన్ అధికారులతో ఇతర అధికారులతో కలిసి శుక్రవారం మెదక్ కలెక్టరేట్ లో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు సమీక్షించారు. ఈ సందర్భంగా మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ ప్రజా పాలనలో నియోజకవర్గ ప్రజలు అభివృద్ధి అవసరాలు యోగక్షేమాలు తీర్చడమే లక్ష్యంగా ముందుకు పోతున్నామన్నారు. ఎస్ డి ఆర్ ఎఫ్ నిధులు 10 కోట్లు ఉన్నాయని విపత్తు నిధులు వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రకృతి విపత్తుల నేపధ్యంలో భారీ వర్షాలు వరదలతో జిల్లాలో పంచాయతీరాజ్ ఇరిగేషన్, ఆర్ అండ్ బి శాఖలకు సంబంధించిన రోడ్లు కల్వర్టులు, కాజు వేలు చెరువులు పెద్ద ఎత్తున నష్టం వాటిలిందని చెప్పారు. ఎస్ డి ఆర్ ఎఫ్ నిధులతో తాత్కాలిక, శాశ్వత పనులు అంచనాలు సంబంధిత శాఖల ద్వారా అడిగి తెలుసుకోవడం జరిగిందన్నారు. పనులు వేగవంతం చేసి ప్రజలకు రవాణా సౌకర్యానికి ఇబ్బంది లేకుండా చూడాలని, అధికారులను ఆదేశించారు. అనంతరం మెదక్ సుందరీకరణ పై మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ డి ఈ తో కలిసి చర్చించారు. మెదక్ పట్టణం సుందరీకరణ పనులు వేగవంతం చేయాలని, మెదక్ అన్ని జిల్లాల కంటే వినూత్నంగా ముందు వరుసలో ఉండాలని ఐ లవ్ మెదక్ అనే నినాదంతో ఉండాలన్నారు. ఎంట్రన్స్ రోడ్డు లైటింగ్ మూడు చౌరస్తాలు సుందరీకరణ, బ్రాస్ మెటీరియల్ తో అంబేద్కర్ విగ్రహం తయారు చేయించాలని, మెదక్ చర్చిలో సెంట్రల్ లైటింగ్ ఇంటర్నల్ సిసి రోడ్స్ సంబంధించిన అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఈ సర్దార్ సింగ్, పంచాయతీరాజ్ ఈఈ నరసింహులు, ఇరిగేషన్ ఈ శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, ముఖ్య ప్రణాళికా అధికారి సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# సేవాపక్షం పక్వాడ్ వర్క్ షాప్

- హాజరైన మెదక్ ఎంపీ రఘునందన్

**జిన్నారం, సెప్టెంబర్ 12 (ప్రజాస్వరం ) :**
జిన్నారం మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో భాజపా తెలంగాణ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు సేవ పక్షం పక్వాడ్ వర్క్ షాప్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవినేని రఘునందన్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క భాజపా నాయకులు స్థానిక సంస్థల ఎన్నికలలో భాజాపే గెలుపు దిశగా ప్రతి ఒక్కరూ ఎంతో శ్రద్ధతో కృషి చేసుకోవాలని దిశ నిర్దేశం చేశారు. అలాగే రేపు సెప్టెంబర్ 17న భారత ప్రధాని శ్రీ నరేంద్ర మోడీ గారి జన్మదిన వేడుకలు కూడా ఘనంగా జరుపుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో జిల్లా భాజపా ఉపాధ్యక్షులు ప్రతాప్ రెడ్డి, ఉమ్మడి జిన్నారం మండల అధ్యక్షులు కొత్త కాపు జగన్ రెడ్డి, కావలి ఐలేష్, జిల్లా కౌన్సిల్ సభ్యులు పలు గోవర్ధన్ రెడ్డి సుధాకర్, జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి, ఉమ్మడిదల మండల మహిళా మోర్చా అధ్యక్షురాలు సారా సృజన లక్ష్మీ, భాజపా నాయకురాలు అనిత,గడ్డపోతారం మున్సిపాలిటీ అధ్యక్షులు, గుమ్మడిదల,జిన్నారం మండల బూత్ అధ్యక్షులు కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.

# లోక్ ఆదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

## రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



**రామగుండం/పెద్దపల్లి, సెప్టెంబర్12(ప్రజా స్వరం) :**
రాజీమార్గం రాజమార్గమని కక్షలు,కార్పణ్యాలతో ఏమీ సాధించలేమని,రాజీపడితే ఇద్దరూ గెలిచినట్లేనని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు.ఈ మేరకు శుక్రవారం పత్రికా ప్రకటనను విడుదల చేశారు.ఈ నెల 13వ తేదీన జరుగనున్న జాతీయ లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయం జరుగుతుందని తెలిపారు.రాజీపడదగిన కేసులలో క్రిమినల్ కంపౌండబుల్ కేసులు,సివిల్ తగాదా కేసులు ఆస్తి విభజన కేసులు కుటుంబపరమైన నిర్వాహణ కేసులు వైవాహిక జీవితానికి సంబంధించిన కేసులు బ్యాంకు రికవరీ,టెలిఫోన్ రికవరీ కేసులు,విద్యుత్ చౌర్యం,చెక్ బౌన్స్ కేసులో ఇతర రాజీ పడ్డ దగిన కేసుల్లో కక్షిదారులు రాజీ పడాలని సూచించారు.రాజీ మార్గం రాజ మార్గమని చిన్న చిన్న కేసులతో కక్షలు పెంచుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని,డబ్బులను వృథా చేసుకోవద్దని సూచించారు.జుడిషియల్ డిపార్ట్మెంట్ ఇచ్చిన అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.పోలీస్ అధికారులు కోర్టు విధులు నిర్వహించే కానిస్టేబుల్ లు పోలీస్ సిబ్బంది రాజీపడ్డ దగిన కేసులను గుర్తించి ఇరువర్గాల వారిని పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించి రాజీ పడేటట్లు అవగాహన కల్పించాలని సూచించారు.లోక్ అదాలత్ ద్వారా బాధితులకు సత్వరమే న్యాయం జరుగుతుందని పోలీస్ కమిషనర్ తెలిపారు.

# తైబజార్ వసూళ్ల రద్దుకు ఆదేశం



**మెదక్, సెప్టెంబర్ 12 (ప్రజా స్వరం) :**
మెదక్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు మున్సిపల్ అధికారులతో సమీక్ష సమావేశం లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెదక్ తైబజార్ వసూలు పై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. గిరిజన మహిళా పై దురుసుగా ప్రవర్తించడం పట్ల ఎమ్మెల్యే తీవ్రంగా మండిపడ్డారు. మెదక్, రామాయంపేట తైబజార్ ను పూర్తిగా రద్దు కు చేస్తున్నట్లు ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు తెలిపారు. మెదక్ లో గిరిజన మహిళా పై తైబజార్ వాసులు చేసే వ్యక్తి అనుచిత వ్యాఖ్యలు బాధాకరం అన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు పెట్టాలని డీఎస్పీ కి ఆదేశించారు. సామాన్య ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్న ఉద్దేశ్యంతో తైబజార్ రద్దు చేసినట్లు పేర్కొన్నారు.

# తూంకుంటలో హంట్ వ్యాక్సిన్ క్యాంప్




**శామీర్‌పేట, సెప్టెంబర్ 12(ప్రజాస్వరం) :**
తూంకుంట పురపాలక సంఘ కార్యాలయం వద్ద శుక్రవారం హంట్ వ్యాక్సిన్ క్యాంప్ బ్లూ క్రాస్ హైదరాబాద్ వారితో సంయుక్తంగా అంటి రాబీస్ హంట్ వ్యాక్సిన్ క్యాంపు ఏర్పాటు చేయడం జరిగింది, ఈ కార్యక్రమం మొబైల్ క్యాంపుల ద్వారా కూడా అన్ని వార్డులలో నిర్వహించడం జరిగింది. శుక్రవారం ఈ క్యాంపు ద్వారా సుమారు 190 పెంపుడు కుక్కలు, వీధి కుక్కలకు ఏఆర్వి టీకాలు వేయించడం జరిగినదని మున్సిపల్ కమిషనర్ ఏం ఎన్ ఆర్ జ్యోతి తెలిజేశారు. పురపాలక సంఘ పరిధిలోని ప్రజలు అందరూ తమ పెంపుడు కుక్కలకు సమయానుసారం ఏఆర్వి టీకాలు వేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రీజినల్ ట్రాన్స్పోర్ట్ అథారిటీ మెంబర్ భీమిడి జైపాల్ రెడ్డి బ్లూ క్రాస్ హైదరాబాద్ మెంబర్ కుమారి, సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# కల్లు కంపౌండ్లలో భద్రతా చర్యలు తప్పనిసరి

- ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ స్పష్టమైన ఆదేశాలు

**శామీర్‌పేట, సెప్టెంబర్ 12 (ప్రజాస్వరం) :**
శామీర్‌పేట పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ ఉమ్మడి శామీర్ పేట మండలంలోని కల్లు కంపౌండ్ నిర్వాహకులతో శుక్రవారం సమావేశమయ్యారు. సమావేశంలో కల్లు కంపౌండ్లలో తీసుకోవలసిన భద్రతా చర్యలపై చర్చించారు. ప్రతి కంపౌండ్‌లో తప్పనిసరిగా సిసి టివి కెమెరాలు ఏర్పాటు చేయాలని, చట్టానికి లోబడి సక్రమంగా నిర్వహించుకోవాలని నిర్వాహకులకు ఆదేశించారు. అదేవిధంగా, నిర్వాహకులకు ఒక నోటీసు జారీ చేసి, పై సూచనలను తప్పనిసరిగా పాటించాల్సిందిగా స్పష్టమైన సూచనలు ఇచ్చారు. ప్రజల భద్రత, శాంతి భద్రత కాపాడడంలో శామీర్ పేట పోలీసులు ఎల్లప్పుడూ ప్రజలతో కలిసి పనిచేస్తారని, ప్రజల సహకారంతో మరింత సురక్షిత వాతావరణం నెలకొల్పుతామని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్సైలు శశివర్ధన్ రెడ్డి, దశరథ్ పాల్గొన్నారు.









# రాజీవ్ రహదారిని సందర్శించిన మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ వెంకటరెడ్డి

**శామీర్‌పేట, సెప్టెంబర్ 12 (ప్రజాస్వరం) :**
శామీర్‌పేట్‌లోని రాజీవ్ రహదారిపై జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు నివారణకై స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం ట్రాఫిక్ ఏసిపి వెంకట్ రెడ్డి సందర్శించారు. రోడ్డు ప్రమాదాల నివారణపై చర్యలు తీసుకునేంత వరకు వాహనదారులు జాగ్రత్తలు తీసుకోవాలని ట్రాఫిక్ ఏసిపి అన్నారు. వాహనదారులు సహకరిస్తేనే రోడ్డు ప్రమాదాలను అరికట్టవచ్చని అన్నారు. రాజీవ్ రహదారిపై జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటామని ఏసిపి తెలిపారు. వాహనదారులు కూడా జాగ్రత్తగా వాహనాలు నడపాలని, యూటర్న్ చేసేటప్పుడు నిదానంగా వెళుతూ జాగ్రత్తలు పాటిస్తూ వాహనాన్ని నడపాలన్నారు. ఈ కార్యక్రమంలో శామీర్ పేట్ సీఐ శ్రీనాథ్, మేడ్చల్ ట్రాఫిక్ సిఐ మధుసూదన్, తూంకుట మున్సిపల్ సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# రాష్ట్ర మార్కెట్ కమిటీ ఫోరం ప్రధాన కార్యదర్శిగా నర్సింహులు యాదవ్



**శామీర్ పేట, సెప్టెంబర్ 10 (ప్రజాస్వరం) :**
రాష్ట్ర మార్కెట్ కమిటీ ఫోరం ప్రధాన కార్యదర్శిగా నర్సింలు యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా బొమ్మలపల్లి నర్సింహులుయాదవ్ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వజ్రష్ యాదవ్ ను మర్యాదపూర్వకంగా కలవగా ఆయన నర్సింహులుయాదవ్ కు శుభాకాంక్షలు తెలిపి అభినందించి సన్మానించారు. వలువురు నాయకులు నర్సింహులుయాదవ్ కు శుభాకాంక్షలు తెలిపారు.

# నేపాల్‌లోని తెలుగు వారికి లోకేశ్ భరోసా

## నారా లోకేష్ చేసిన కృషి అపారమన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి



**మన్యం జిల్లా, సెప్టెంబర్ 13 ( ప్రజాస్వరం ) :**
నేపాల్‌లో ఆందోళనలు, హింసకాండలో చిక్కుకుపోయిన తెలుగువారిని సురక్షితంగా స్వస్థలాలకు చేరవేయడంలో నారా లోకేష్ చేసిన కృషి అపారమని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ మరియు కురుపాం శాసనసభ్యురాలు తోయకజగదీశ్వరిఅభిప్రాయం వ్యక్తం చేశారు. తెలుగువారికి ఎప్పుడైనా, ఎక్కడైనా ప్రమాదం తలెత్తిన ముందడుగు వేసి వారిని కాపాడే ధైర్యసాహసాలు ఆయన నాయకత్వానికి ప్రత్యేకత అని ఎమ్మెల్యే జగదీశ్వరి అన్నారు. నేపాల్ లో తెలుగువారు చిక్కుకున్నట్లు సమాచారం అందిన వెంటనే అనంతపురం పర్యటనను రద్దు చేసుకుని, అమరావతికి హుటాహుటిన చేరుకొని సహాయక చర్యలు చేపట్టడం లోకేష్ గారి మానవత దృక్పథాన్ని స్పష్టంగా చాటిందని పేర్కొన్నారు. బాధితులతో నేరుగా మాట్లాడి ధైర్యం చెప్పడం, లొకేషన్ కోఆర్డినేటర్లతో మ్యాప్ సిద్ధం చేయించడం, ఢిల్లీలోని ఏపీ భవనంలో అత్యవసర హెల్ప్ లైన్ ఏర్పాటు చేయడం వంటి చర్యలతో ఆయన వేగవంతముగా స్పందించారని వివరించారు. కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేస్తూ సుమారు 215 మంది తెలుగువారిని సురక్షితముగా స్వదేశానికి రప్పించడంలో లోకేష్ కీలక పాత్ర పోషించారని, ఇది ప్రతి తెలుగు కుటుంబానికి గర్వకారణం అని ఎమ్మెల్యే గారు అన్నారు. మా కురుపాం నియోజకవర్గం నుండి నేపాల్ పర్యటనకు వెళ్లిన పర్యాటకులను క్షేమముగా వారి స్వస్థలాలకు పంపించిన నారా లోకేష్ మా కురుపాం నియోజకవర్గ ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. ఇక కంబోడియా సైబర్ స్కాం నుంచి యువకుల రక్షణ, ఉత్తరాఖండ్ వరదలు, గల్ఫ్ దేశాల్లో చిక్కుకున్న వారి సహాయం వంటి ఉదాహరణలు కూడా లోకేష్ మరియు చంద్రబాబు గారు చేసిన మానవత కృషికి నిదర్శనాలని ఎమ్మెల్యే గుర్తు చేశారు. అయితే నేపాల్ ఘటనపై మాజీ సీఎం జగన్ కనీస స్పందన చూపకపోవడం ఆందోళన కలిగించే విషయమని ఎమ్మెల్యే విమర్శించారు. ప్రజల కష్ట సమయములో పక్కన నిలబడటం ప్రతి ప్రభుత్వానికి ప్రాధాన్యత కావాలని సూచించారు. తెలుగువారు ఎక్కడ కష్టాల్లో ఉన్న వారి వెన్నంటే నిలబడేది తెలుగుదేశం పార్టీనే అనే నిజాన్ని ఈ సంఘటన మరోసారి రుజువు చేసింది అని ఎమ్మెల్యే జగదీశ్వరి స్పష్టం చేశారు.

# ధాన్యం కొనుగోలుకు ప్లాన్ పక్కాగా ఉండాలి



- పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష
- కోనుగోలు కేంద్రాలలో అవసరమైన మౌలిక వసతుల కల్పన
- ధాన్యం రవాణకు అవసరమైన వాహనాలను సన్నద్ధం చేయాలి
- సన్నరకాల ధాన్యాన్ని గుర్తించి వాటిని ప్రత్యేకంగా కేటాయించిన రైస్ మిల్లులకు తరలింపు
- ధాన్యం కొనుగోలు సన్నద్ధత పై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించిన జిల్లా కలెక్టర్

**పెద్దపల్లి, (ప్రజా స్వరం) :**

జిల్లాలో ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ 202526 కు సంబంధించి వరి పంట పక్కా ప్రణాళికతో కొనుగోలు చేసేందుకు అధికారులు సన్నద్ధం కావాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ లో ధాన్యం కొనుగోలు సన్నద్ధత పై అదనపు కలెక్టర్ బి.వేణు తో కలిసి సంబంధిత అధికారుల తో సమీక్ష నిర్వహించారు. వానాకాలం ధాన్యం కొనుగోలు కు సంబంధించి రూపొందించుకున్న ప్రణాళిక, అందుబాటులో ఉన్న మౌలిక వసతులు, తదితర అంశాలను అధికారులు వివరించారు.ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు సంబంధించి ఏ మాసం ఎంత ధాన్యం దిగుబడి కొనుగోలు కేంద్రాలకు వస్తుందో మండలాల వారిగా ముందస్తుగానే ప్రణాళిక తయారు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ప్రస్తుత సీజన్ లో గ్రేడ్ ఏ రకం ధాన్యానికి 2389,సాధారణ రకం ధాన్యానికి 2369 మద్దతు ధర చెల్లించడం జరుగుతుందని కలెక్టర్ అన్నారు.ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తేమ యంత్రాలు,ప్యాడి క్లీనర్లు,వేయింగ్ యంత్రాలు,టార్ఫాలిన్ మొదలగు వసతులు ఉండేలా చూడాలని కలెక్టర్ తెలిపారు. ధాన్యం దిగుబడి ఆధారంగా అవసరమైన మేర గన్నీ బ్యాగులు అందుబాటులో ఉండాలని అన్నారు.జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వేయింగ్ యంత్రాలను పరీక్షించాలని కలెక్టర్ తెలిపారు.కొనుగోలు కేంద్రాలకు దాన్యం వచ్చే షెడ్యూల్ ప్రకారం కొనుగోలు కేంద్రాలలో అవసరమైన మౌలిక వసతులు ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.ధాన్యం కొనుగోలు దగ్గరే ధాన్యం నాణ్యతను కట్టుదిట్టంగా పరిశీలించాలని,రైస్ మిల్లుల వద్ద ఎటువంటి కోతలు ఉండడానికి వీలులేదని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం సన్న రకాల ధాన్యాలను ధాన్యం కొనుగోలు కేంద్రాల ఇంచార్జి వ్యవసాయ విస్తరణ అధికారితో సమన్వయం చేసుకుంటూ గుర్తించాలని, వీటిని కోనుగోలు చేసిన తర్వాత ప్రత్యేకంగా కేటాయించిన రైస్ మిల్లులకు తరలించాలని కలెక్టర్ తెలిపారు.ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో త్రాగు నీరు,విద్యుత్ సరఫరా,లైట్లు మొదలగు సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైస్ మిల్లులకు తరలించేందుకు వీలుగా అవసరమైన మేర వాహనాలు సన్నద్ధం చేయాలని కలెక్టర్ తెలిపారు.ప్రతిరోజు ధాన్యం కొనుగోలు కు సంబంధించిన నివేదిక సమర్పించాలని,దాన్యం కొనుగోలు కేంద్రాల ఇంచార్జి అవసరమైన శిక్షణ అందజేయాలని కలెక్టర్ సూచించారు.ధాన్యం నాణ్యత ప్రమాణాలు పై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ,నాణ్యమైన ధాన్యాన్ని రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకుని రావాలని,ఈ అంశం రైతులలో విస్తృతంగా వెళ్ళాలని కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి శ్రీనాథ్, పౌరసరఫరాల సంస్థ మేనేజర్ శ్రీకాంత్, జిల్లా సహకార అధికారి శ్రీమాల, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్, అడిషనల్ డిఆర్డిఓ రవీందర్ పాల్గొన్నారు.



# లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- వర్షపు నీరు నిలువ ఉండకుండా చర్యలు చేపట్టాలి
- జిల్లా యంత్రాంగం ప్రజల రక్షణలో అందుబాటులో ఉంది
- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**మెదక్, సెప్టెంబర్ 12 (ప్రజా స్వరం) :**

జిల్లా లో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. శుక్రవారం మెదక్ పట్టణం గోల్కొండ వీధి, గాంధీ నగర్ లో ఇటీవల కురిసిన వర్షాల వల్ల ఇండ్లలోకి నీరు చేరిన ప్రాంతాలను మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెదక్ మున్సిపాలిటీలో వివిధ వార్డులలో లోతట్టు ప్రాంతాలలో అధిక వర్షాలు నేపథ్యంలో భారీ వరద నీరు వచ్చి చేరుతుందని పరిష్కార మార్గాలు అన్వేషించి తక్షణ సహాయక చర్యలపై దృష్టి సారిస్తున్నామన్నారు. మురికి కాలువలు చెత్తాచెదారం లేకుండా శుభ్రం చేయించాలని, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డిని ఆదేశించారు. భారీ వర్షాలు నేపద్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని,





అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే బయటికి రావాలని కోరారు. మన జిల్లాలో కొన్ని చోట్ల భారీగా వర్షపాతం నమోదైందన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.







- లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తున్న చెరువు
- పర్యాటకులను కనువిందు చేస్తున్న చెరువు ప్రాంతం

**శామీర్‌పేట, సెప్టెంబర్ 12 (ప్రజాస్వరం) :**

శామీర్ పేట్ పెద్ద చెరువుకు జలకళ సంతరించుకుంది. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు, ఎగురువ నుండి వస్తున్న వరదలతో శామీర్ పేట్ పెద్ద చెరువు అలుగులు పారేందుకు సిద్దంగా ఉంది. ఈ నిండితే చెరువుకు దిగువన ఉన్న గ్రామాల తో పాటు మండలాలు, జిల్లాల వరకు సాగు నీరు పుష్కలంగ అందుతుంది. యాదాద్రి భువనగిరి జిల్లా వరకు శామీర్ పేట్ పెద్ద చెరువు నీరు కాలువల ద్వారా పారుతూ పోతుంది. ఈ చెరువు నిండితే సుమారు కొన్ని లక్షల ఎకరాల వరకు పంట సాగు చేసుకునేందుకు రైతులకు అనుకూలంగా ఉంటుంది. ఈ చెరువుతో కొన్ని గ్రామాలకు సాగు, తాగు నీరు అందుతుంది. పర్యాటకులను కనువిందు చేస్తున్న చెరువు ప్రాంతం ఈ చెరువును 19వ శతాబ్దంలో నిర్మించారని, 6వ నిజాం మహబూబ్ అలీపాషా ప్రాచుర్యం పొందేలా చేశాడని పురానాలు చెప్తున్నాయి. ఈ చెరువు కట్టపై కట్ట మైసమ్మ వారు సాక్షాతుగా వెలసిందని ప్రజలు చెప్పుకుంటారు. ఈ చెరువు పర్యటకులకు ఎంతో తృప్తిని, మనశాంతిని ఇస్తుందని పర్యటకులు చెప్పుంటారు. నగరంకు అతి దగ్గర సికింద్రాబాద్ నుండి సుమారు 27 కిలో మీటర్ల దూరంలో ఉన్న ఈ చెరువును చూసేందుకు భారీగా పర్యటకులు చేరుకుంటారు. ఇది చాలా మనోహరమైన దృశ్యమని చెప్పవచ్చు. సరస్సు చుట్టూ ఉన్న ప్రాంతం పచ్చదనంతో కప్పబడి ఉంది. ఇక్కడ అనేక రకాల మొక్కలు మరియు చెట్లను చూడగలుగుతారు. ఈ చెరువు వద్ద కట్ట మైసమ్మ ఆలయంతో పాటు చెరువు చుట్టుప్రక్కల జవహర్ డీర్ పార్క్, నల్సార్ లా యూనివర్సిటీ, ప్రభుత్వం నడిపించే ఓ రెస్టారెంట్ తో ఈ ప్రాంతం యొక్క వైభవాన్ని మరింత పెంచుతుందని చెప్పవచ్చు. ఈ చెరువును పర్యాటక కేంద్రంగా చేస్తే పర్యాటకుల సంఖ్య మరింత పెరగడంతో పాటు పర్యాటకులకు ఒక తీపి అనుభూతిగా మారుతుంది.

# విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ

**శామీర్ పేట సెప్టెంబర్ 12(ప్రజాస్వరం) :**

తూంకుంట మున్సిపాలిటీ పరిధిలోని దేవరయాంజాల్ లోని మండల పరిషత్ పాఠశాలకు బంజారాహిల్స్ రోటరీ క్లబ్ అధ్యక్షురాలు గోదావర్తి నీరజ, సభ్యులు యనమంద్ర యశోద, సెయింట్ పీటర్స్ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ టీ.సరోజ విద్యార్థులకు నోట్‌బుక్‌లు, స్టేషనరీ సామగ్రి, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కల్యాణి, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ఆర్టీఏ సభ్యులు భీమిడి జైపాల్ రెడ్డి, శ్రీ సీతారామ స్వామి దేవస్థానం చైర్మన్ పేండం లక్ష్మీ నారాయణ, మాజీ ధర్మకర్త పట్నం నర్సింహా రెడ్డి, ఉపాధ్యాయులు, తదితరులు



పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు, పాఠశాల యాజమాన్యం, రోటరీ క్లబ్ అధ్యక్షురాలు గోదావర్తి నీరజ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.



# తొగుట సీఐపై చర్యలు తీసుకోవాలి

## రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు డీబీఎఫ్ విన్నపం

**దౌల్తాబాద్, 12 సెప్టెంబర్ (ప్రజాస్వరం) :**
కులాంతార వివాహహాలు చేసుకొని రక్షణ కోసం పోలీస్ స్టేషన్ సంప్రదించిన జంటలకు రక్షణ కల్పించకుండా నిర్లక్ష్యం వహిస్తున్న తోగుట సిఐ పై చర్య తీసుకోవాలని దళిత బహుజన ఫ్రంట్ ( డిబిఎఫ్) జాతీయ కార్యదర్శి పి.శంకర్ అన్నారు. శుక్రవారం రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కార్యాలయం హైదరాబాద్ లో డిబిఎఫ్ ఆధ్వర్యంలో వివిధ సంఘాల నాయకులు రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు తొగుట సీఐపై ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దౌల్తాబాద్ మండలం ఇందుప్రియాల్, రాయపోల్ మండలం అనాజీపూర గ్రామాలకు చెందిన దళిత యువకులు కులాంతార వివాహలు చేసుకొని రక్షణ కల్పించాలని పోలీసులను ఆశ్రయిస్తే, అలాంటి జంటలకు రక్షణ కల్పించకుండా కౌన్సిలింగ్ పేరుతో జంటలను విడదిస్తున్నారని పిర్యాదు చేశారు. ఈ విషయం పై స్పందించిన రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ సిద్దిపేట పోలీస్ కమిషనర్ కు పూర్తి విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకొవాలని ఆదేశాలను జారి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ మాల మహానాడు మెదక్ జిల్లా అధ్యక్షులు కళ్ళూరి సంజివ్ ,శివ తదితరులు పాల్గొన్నారు.

# హస్టల్స్ నిర్వహణ పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి

- పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష
- గురుకులాల నిర్వహణ పై అధికారులతో సమావేశం నిర్వహించిన కలెక్టర్



**పెద్దపల్లి, సెప్టెంబర్12(ప్రజా స్వరం):**
జిల్లాలోని హస్టల్స్ నిర్వహణ పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో గురుకులాల నిర్వహణ పై అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ జిల్లాలోని ఎస్సీ,ఎస్టీ,బీసీ ,మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలలో నమోదు చేసుకున్న విద్యార్థుల హాజరు పూర్తి స్థాయిలో ఉండేలా రెగ్యులర్ మానిటరింగ్ చేయాలని అన్నారు.విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంతో పాటు స్టడీ అవర్స్ సక్రమంగా నిర్వహించాలని అన్నారు.రెసిడెన్షియల్ పాఠశాలలో పదవ తరగతి ఫలితాలలో 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు.వాన కాలం నేపథ్యంలో విద్యార్థులకు అనారోగ్య సమస్యలు రాకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని,గురుకులాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని నీరు నిల్వ లేకుండా చూడాలని అన్నారు.ఈ సమావేశంలో బీసి అభివృద్ధి అధికారి రంగారెడ్డి,ఎస్సి అభివృద్ధి అధికారి వినోద్ కుమార్,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# రక్తదానంపై అవగాహన సదస్సు

**మన్యం జిల్లా, సెప్టెంబర్ 13 ( ప్రజాస్వరం ) :**
పార్వతీపురం, పెద్దమరికి దగ్గరలో గల గిరిజన యువతకు రక్తదానంపై అవగాహన కార్యక్రమాన్ని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ మంచిపల్లి శ్రీరాములు ఆధ్వర్యంలో బోటు రామకృష్ణ రక్తదానం పై అవగాహన కార్యక్రమం రక్తం అవసరత, ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.


# మానవ జీవనానికి అనుభవాలను అందించేదే సాంఘికశాస్త్రం

## మండల విద్యాధికారి గజ్జెల కనకరాజు

**దౌల్తాబాద్, సెప్టెంబర్ 12(ప్రజాస్వరం) :**
జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల దౌల్తాబాద్ లో సాంఘిక శాస్త్రం పై కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండల విద్యాధికారి గజ్జల కనకరాజు మాట్లాడుతూ సమాజంలో మారుతున్న సామాజిక పరిసరాలకు అనుగుణంగా ఎలా మసలుకోవాలో బాలబాలికలకు తెలియజేయడం, విద్యార్థులు తమ భవిష్యత్తు జీవనాన్ని ఉపయోగకరంగా సాగించడానికి అవసరమైన విలువలు, వైఖరులు, అభిరుచులు, నైపుణ్యాలు, మానవ సంబంధాలను పెంపొందించడమే సాంఘికశాస్త్ర ముఖ్య ఉద్దేశ్యమన్నారు. బాలబాలికల్లో పాఠశాలస్థాయి నుంచే అంతర్జాతీయ అవగాహన, విశ్వ మానవ సౌభ్రాతృత్వం, మానవ సంబంధాలను పెంపొందించాలనే ఉద్దేశంతో వివిధ సామాజికశాస్త్ర విభాగాల నుంచి ఎంపిక చేసిన పాఠ్య విషయాలతో 'సాంఘికశాస్త్రం' రూపొందించారన్నారు.కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు అనిల్ కుమార్ మాట్లాడుతూ కాంప్లెక్స్ సమావేశంలో నేర్చుకున్నటువంటి అంశాలను పాఠశాల స్థాయిలో విద్యార్థులకు నేర్పించాలన్నారు. ప్రతి విద్యార్థిలో అన్ని అంశాలపై అభ్యసన సామర్థ్యాలను సాధించేలా ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేసినప్పుడే ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దడానికి అవకాశం ఉంటుందని సూచించారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు నవీన్ కుమార్,భాస్కర్ రెడ్డి,సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.



# ఔదార్యాన్ని చాటుకున్న ఆది వేణుగోపాల్



**దౌల్తాబాద్, సెప్టెంబర్ 12(ప్రజాస్వరం) :**
దౌల్తాబాద్ సబ్ స్టేషన్ లో విద్యుత్ తీగలకు తగిలి తీవ్ర గాయాలతో పడిపోయిన కోతి ప్రాణాలను రక్షించి మానవత్వాన్ని చాటుకున్నాడు దౌల్తాబాద్ మాజి సర్పంచ్ ఆది వేణుగోపాల్. ఎవరూ పట్టించుకోని సమయంలో, ఆది వేణుగోపాల్ వెటర్నరీ వైద్యులకు సమాచారం అందించి గాయపడిన కోతికి చికిత్స చేయించి కోలుకున్న కోతికి పండ్లు తినిపించాడు. జంతువుల పట్ల కూడా ఇంత మానవత్వం చూపించడం నిజంగా గొప్ప విషయమని స్థానికులు ప్రశంసించారు.ఈ సంఘటన సోషల్ మీడియాలో కూడా చర్చనీయాంశంగా మారింది. పలువురు నెటిజన్లు ఆది వేణుగోపాలు ప్రాణదాతగా కొనియాడుతున్నారు.

# పదోన్నతి పొందిన ప్రధానోపాధ్యాయుడికి సన్మానం




**దౌల్తాబాద్, సెప్టెంబర్ 12(ప్రజాస్వరం) :**
పాఠశాల కాంప్లెక్స్ సమావేశంలో మండల సోషల్ ఫోరమ్ ఆధ్వర్యంలో నూతనంగా పదోన్నతి పై దౌల్తాబాద్ బాలుర ఉన్నత పాఠశాలకు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు చామకూర అనిల్ కుమార్ ను శాలువాతో సత్కరించి రిటైర్డ్ ప్రిన్సిపాల్ గూళ్ల వెంకటయ్య ఆదర్శ జీవన కథనం పుస్తకం బహుకరించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ రాష్ట్ర రిసోర్స్ పర్సన్ గా బాధ్యతలు నిర్వహించిన అనిల్ కుమార్ ప్రధానోపాధ్యాయులుగా రావడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. అదేవిధంగా ఉత్తమ ఉపాధ్యాయులు సావిత్రి పదోన్నతి పొందిన లలిత, శ్రీనివాస్ లకు కు శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి గజ్జెల కనకరాజు,రిసోర్స్ పర్సన్స్ భాస్కర్ రెడ్డి,నవీన్, ఫోరమ్ కన్వీనర్ సత్యనారాయణ,కో కన్వీనర్ కిషన్ రెడ్డి,రవీందర్,దశరథం ,పిడి విష్ణు,రమ, సిఆర్పి రాజు తో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు

- దళిత నాయకుడు ఊట్ల శ్రీను ఆగ్రహం

**ముత్తారం/ పెద్దపల్లి, సెప్టెంబర్12(ప్రజా స్వరం) :**
పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం పోతారం గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరిగాయని,గ్రామ కార్యదర్శి కనుసన్నల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక జరిగిందని దళిత నాయకుడు ఊట్ల శ్రీను తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాడు.4050 మంది నుంచి ఆధార్,రేషన్ కార్డులు ,ఫోటోలు సేకరించి,ఆన్లైన్లో నమోదు చేసినా చివరికి కేవలం ముగ్గురికే ఇళ్లు కేటాయించడం సరికాదని ఆయన విమర్శించారు.అర్హులైన వారందరికీ ఇళ్లు అందేలా రీఎంక్వైరీ చేయాలని అన్నారు.అర్హులకు కాకుండా అనర్హులకు ఇండ్లు కేటాయిస్తే ఊరుకునేది లేదని తీవ్ర స్థాయిలో ఆందోళన చేపడుతామని హెచ్చరించాడు.

# మృతుడి కుటుంబానికి మాజీ జెడ్పిటిసి ఆర్థిక సహాయం



**రామగిరి/ పెద్దపల్లి, సెప్టెంబర్12(ప్రజా స్వరం) :**
రామగిరి మండలం ఆదివారంపేట గ్రామానికి చెందిన ఇల్లందుల సన్నీ గత కొద్దీ రోజుల క్రితం కరీంనగర్ లోని కారు ప్రమాదంలో మృతి చెందగా వారి కుటుంబాన్ని మాజీ జెడ్పిటిసి మైదం భారతి వరప్రసాద్ శుక్రవారం పరామర్శించారు.మృతుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించాడు.మృతికి గల కారణాలను అడిగి తెలుసుకోని సంతాపం వ్యక్తం చేశాడు. అనంతరం మృతుని తల్లితండ్రులకు రెండు వేల రూపాయలు 25కిలోల బియ్యం ఆర్థిక సాయంగా అందజేశారు.వారి వెంట సింగిల్ విండో వైస్ చైర్మన్ ఎలువాక కొమురయ్య,సీనియర్ నాయకులు ఆరెల్లి సాయిలు,రామగిరి మండల యూత్ ఉపాధ్యక్షుడు గోడిశేల సంతోష్,గ్రామ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కన్నూరి శ్రీకాంత్,చింతల కిషన్ రెడ్డి,ఇల్లందుల సంజీవ్,బొద్దు కృష్ణ,బండ కనుకయ్య తదితరులు పాల్గొన్నారు.




# 17వ తేదీ నుంచి సేవా కార్యక్రమాలు

**మాసాయిపేట, సెప్టెంబర్ 12 (ప్రజాస్వరం) :**
సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు 'సేవా పక్షం' కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేష్ గౌడ్ తెలిపారు. మాసాయిపేటలో జరిగిన మండల స్థాయి కార్యశాలలో ఆయన మాట్లాడారు. ఈ 15 రోజుల్లో రక్తదానం, మొక్కలు నాటడం, కుల వృత్తుల వారిని, రిటైర్డ్ అధికారులను సత్కరించడం, ఆసుపత్రుల్లో పండ్ల పంపిణీ కార్యక్రమాలు చేపడతామని ఆయన వివరించారు.

## రావులపల్లి కలాన్ లో ఉచిత వైద్య శిబిరం

**శంకర్‌పల్లి సెప్టెంబర్ 12(ప్రజాస్వరం):** భగవాన్ సత్యసాయి బాబా సేవా సంస్థలు రంగారెడ్డి జిల్లా చేవెళ్ల సమితి శంకర్‌పల్లి భజన మండలి ఆధ్వర్యంలో మండల పరిధిలోని రావులపల్లి కలాన్ గ్రామంలో ఆదివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందని సత్యసాయి సేవా సంస్థలు శంకర్ పల్లి మండల చెందిన రవి తెలిపారు. నిష్ణాతులైన వైద్యులు వైద్య శిబి రముకు రానున్నారని ఇట్టి వైద్య శిబిరంలో రోగులకు ఉచితంగా మాత్రలు టానిక్ లు ఇవ్వడం జరుగుతుందని, ఆరోగ్యపరమైన సమస్యలు తీవ్రంగా ఉన్నట్లయితే సూచనలు సలహాలు ఇవ్వడమే కాకుండా అవసరమున్న మేరకు ఉచిత శస్త్ర చికిత్సలు కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. రావులపల్లి కలాన్ పరిసర గ్రామాలైన ఆలంఖాన్ గూడ, ముబారక్ పూర్ తదితర


ఆయా గ్రామాల ప్రభుత్వ పాఠశాలల ప్రాంగణములలో జరుగును.
ఈ వైద్యశిబిరములలో వివిధ వైద్య విభాగాలలో నిపుణులైన వైద్యులచే ఉచితవైద్యసలహాలు, ఉచిత షుగర్ పరీక్షలు, కంటి పరీక్షలు నిర్వహించబడును. ఈ ఉచిత వైద్యశిబిరములో మందులు, టానిక్స్, ఉచితంగా ఇవ్వబడును. వివిధ కార్పొరేట్, ప్రముఖ, ప్రఖ్యాత హాస్పిటల్స్ నుండి వైద్యనిపుణులు ఉచితంగా వైద్యసేవలు అందజేస్తారు.
కావున చేవెళ్ళ మండలంలో చేవెళ్ళ మెగాక్యాంప్, ఆయా గ్రామాల ప్రజలు దగ్గరలో నిర్వహించే ప్రత్యేక మెడికల్ క్యాంప్‌ను సువర్ణావకాశంగా భావించి సద్వినియోగం చేసుకుని, ఉచిత వైద్యపరీక్షలు, సలహాలు పొంది స్వామి ఆశీస్సులకు పాత్రులు కాగలరని ఆశిస్తున్నాము
వివరాలకు సంప్రదించండి :
రాష్ట్ర వైద్యసేవల సమన్వయకర్త : శ్రీ జి. భాస్కర్‌రావు గారు, సెల్ : 9440767542
రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు : సెల్ : 9652807599
సమన్వయకర్త : శ్రీ గోపాలచారి గారు, సెల్ : 9949779243
చేవెళ్ళ సమితి కన్వీనర్ : శ్రీ రామాగౌడ్ గారు, సెల్ : 9849871457
శ్రీ సత్యసాయి సేవాసంస్థలు

గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని భగవాన్ సత్యసాయి బాబా ఆశీస్సులతో ఆయురారోగ్యాలతో విరజిల్లాలని ఆయన కోరారు.



## శంకర్‌పల్లి పట్టణంలో ఫస్ట్ లెర్న్ అకాడమీ ట్యూషన్ సెంటర్

**శంకర్‌పల్లి సెప్టెంబర్ 12(ప్రజాస్వరం):** హైదరాబాద్‌లోనే అతి పెద్దదైన ఆఫ్‌లైన్ ట్యూషన్ సెంటర్ ఫస్ట్ లెర్న్ అకాడమీ ఇప్పుడు శంకర్‌పల్లి పట్టణానికి వచ్చేసింది. ఇక్కడ ఎల్‌కేజీ నుంచి ఇంటర్ వరకు విద్యార్థులకు ట్యూషన్ క్లాసెస్ అందుబాటులో ఉంటాయి. ఇక్కడ 1:6 రేషియోను అనుసరిస్తారు. అంటే ఆరుగురు విద్యార్థులకు ఒక టీచర్ ఉంటారు. దీంతో ఒక్కో విద్యార్థిపై ప్రత్యేకమైన దృష్టిసారించే అవకాశం ఉంటుంది. అంతేకాదు ప్రతిరోజు పిల్లలు ఏం నేర్చుకుంటున్నారో తల్లిదండ్రులకు ప్రత్యేకమైన యాప్ ద్వారా ఫీడ్‌బ్యాక్ అందిస్తారు. మంచి ఉత్తీర్ణులైన, ప్రతిభ కలిగిన ట్యూటర్లు పాఠాలు చెప్తారు. ఇతర ట్యూషన్లతో పోలిస్తే ఇక్కడ పిల్లలు శ్రద్ధగా చదువుకునే అవకాశం ఎక్కువగా ఉన్నందున ఈ ట్యూషన్‌లో తమ పిల్లలను చేర్పించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు. శంకర్‌పల్లి నుంచి సంగారెడ్డికి వెళ్లేదారిలో కెనరా బ్యాంక్ పక్కనే ఈ ఫస్ట్ లెర్న్ అకాడమీ ఉంది. అడ్మిషన్స్, ఇతర వివరాలకు ఈ 7013726758 నంబర్‌ను సంప్రదించండని అకాడమీ యాజమాన్యం కోరారు.

## అంతర్ రాష్ట్ర గంజాయి ముఠా అరెస్ట్

**సుమారు 43లక్షల విలువ గల గంజాయి స్వాధీనం**

**దమ్మపేట సెప్టెంబర్ 12(ప్రజాస్వరం):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిధిలో దమ్మపేట పోలీస్ సిబ్బంది శుక్రవారం ఉదయం 08:30 నిమిషాల సమయంలో పట్వారిగూడెం గ్రామ శివారులో అశ్వారావుపేట సిఐ పింగళి నాగరాజు సూచనల మేరకు బి సాయికిషోర్ రెడ్డి సబ్ ఇన్స్పెక్టర్, టాస్క్ ఫోర్స్ సిబ్బంది ఆధ్వర్యంలో వాహనాల తనికి నేపథ్యంలో అనుమానాస్పదంగా పాల్వంచ నుండి దమ్మపేట వైపు వెళ్తున్న వాహనాన్ని చేజించి పట్టుకోవడం జరిగింది వీరిలో అయిదుగురు అరెస్ట్ అవ్వగా ముగ్గురు పరారీలో ఉన్నారు అరెస్ట్ అయిన వారిలో ఒకరు ఎన్ డి ఆర్ ఎఫ్ కానిస్టేబుల్ సుమారుగా 86 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు దీని విలువ 43 లక్షలుగా అంచనా వేసారు చాక చక్యంగా వ్యవహరించిన సిబ్బంది పనితీరును కొత్తగూడెం ఎస్పీ మరియు పాల్వంచ డిఎస్పీ అభినందించారు



## గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుంది

**చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి**

**మొయినాబాద్ సెప్టెంబర్ 12(ప్రజాస్వరం):** గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని, గ్రామాల అభివృద్ధితోనే దేశాభివృద్ధి జరుగుతుందని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని నక్కలపల్లి, చాకలిగూడ గ్రామాలలో ఎంపీ నిధులతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే కె.ఎస్.రత్నంతో కలిసి ఎంపీ పనులను ప్రారంభించి మాట్లాడుతూ.. గ్రామాలలో రోడ్లు బాగున్నప్పుడే పరిసరాల పరిశుభ్రత ఏర్పాడుతుందని అన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలు కేంద్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని తెలిపారు. ప్రజలకు మౌలిక వసతుల కల్పనే ప్రధాన ధ్యేయంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. గ్రామీణ రోడ్ల నిర్మాణానికి ప్రత్యేక చొరవ తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కె.ఎస్.రత్నం, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చనివెళ్లి ప్రభాకర్ రెడ్డి, చేవెళ్ల నియోజకవర్గం ఓబీసీ కన్వీనర్ ఎల్గని వెంకటేష్ గౌడ్, మొయినాబాద్ మున్సిపల్ అధ్యక్షులు మాదాపురం శ్రీకాంత్, బీజేపీ నాయకులు నీలకంఠం, బాకారం శ్రీనివాస్ గౌడ్, బంటు జ్ఞానేశ్వర్, భీమేందర్ రెడ్డి, ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



### సినిమాను మించిన సీన్..

# వ్యాపారి కళ్లలో కారం జల్లి 40 లక్షలు చోరీ..

- శంకర్ పల్లిలో దారి దోపిడీ కలకలం
- స్టీల్ వ్యాపారిని బెదిరించి 40 లక్షల రూపాయలు ఎత్తుకెళిన దుండగులు
- లాక్కున్న డబ్బుతో పారిపోతుండగా కొత్తపల్లి వద్ద ప్రమాదం
- దుండగుల వాహనం బోల్తాపడడంతో కొంత నగదు అక్కడే వదిలేసి పారిపోయిన దుండగులు
- సంఘటన స్థలానికి చేరుకున్న శంకరపల్లి పోలీసులు

**శంకర్ పల్లి సెప్టెంబర్ 12(ప్రజాస్వరం):** శంకర్‌పల్లి సమీపంలో సినీ ఫక్కీలో దారి దోపిడీ జరిగింది. ఓ వ్యాపారి 40 లక్షలను తీసుకెళ్తున్నాడనే సమాచారంతో అతడి కారును పలువురు దుండగులు వెంబడించారు. వ్యాపారి కారును ఢీకొట్టడమే కాకుండా, అతని కళ్లలో కారం జల్లి డబ్బులు తీసుకుని పారిపోయారు. ఈ క్రమంలో దుండగులు ప్రయాణిస్తున్న కారు సైతం బోల్తాపడింది. అప్పటికే స్థానికులు వెంటపడుతుండటంతో కారును అక్కడే వదిలేసి అందినకాడికి డబ్బులు తీసుకుని పరారయ్యారు. వివరాల్లోకి వెళ్తే.. ఓ స్టీల్ వ్యాపారి రూ. 40 లక్షలు తీసుకుని ఫోర్డ్ ఫిగో (టిఎస్09యుడి0093) కారులో వికారాబాద్ నుంచి హైదరాబాద్‌కు బయల్దేరాడు. ఇది తెలుసుకున్న కొందరు దుండగులు స్విఫ్ట్ డిజైర్ కారులో వారిని వెంబడించారు. ఈ క్రమంలోనే ముందు వెళ్తున్న వారి కారును ఢీకొట్టారు. అప్పుడు ముందు కారు ఆగడంతో రాళ్లతో కారు అద్దాలు పగలగొట్టారు. అనంతరం వ్యాపారి కళ్లలో కారం కొట్టి బొమ్మ తుపాకీతో బెదిరించి, 40 లక్షల నగదు తీసుకుని అక్కడి నుంచి వెళ్లిపోయారు. వ్యాపారి నుంచి డబ్బు దోపిడీ చేసి పారిపోతున్న క్రమంలో దుండగులు ప్రయాణిస్తున్న స్విఫ్ట్ డిజైర్ కారు అదుపుతప్పింది. శంకర్‌పల్లి మండలం కొత్తపల్లి గ్రామ సమీపంలో వారి కారు బోల్తా పడింది. అప్పటికే స్థానికులు వెంటపడుతుండటంతో తమ కారును, సామగ్రిని వదిలేసి.. అందినకాడికి డబ్బులు తీసుకుని అక్కడి నుంచి పరారయ్యారు. స్థానికుల ఫిర్యాదుతో ఘటనాస్థలికి వచ్చిన పోలీసులు.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. కారు, బొమ్మ తుపాకీతో పాటు కత్తి, కారం, నగదును స్వాధీనం చేసుకున్నారు. కారు నంబర్, సీసీ టీవీ ఫుటేజీల ఆధారంగా పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు.







## సీఎం సహాయనిధి 8,79,000 రూపాయల చెక్కుల పంపిణీ.

**మక్తల్ ప్రతినిధి సెప్టెంబర్ 12(ప్రజాస్వరం):** తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమ, మత్స్యకార, క్రీడా మరియు యువజన సర్వీసుల శాఖ మాత్యులు డాక్టర్ వాకిటి శ్రీహరి ఆదేశానుసారంగా ఇందిరమ్మ ఇండ్ల చెక్కులు, సీఎంర్ఫ్ మరియు లోకల్ చెక్కుల పంపిణీ శుక్రవారం మక్తల్ నియోజకవర్గం నర్వ మండలం జంగం రెడ్డి పల్లి గ్రామంలో జంగం రెడ్డిపల్లి మరియు కమ్మనూరు గ్రామాల లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయని నిధి చెక్కుల పంపిణీ జంగం రెడ్డి పల్లి గ్రామంలో బేస్మెంట్ పూర్తిచేసిన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల చెక్కులు పంపిణీ.

1) కాట్రావత్ సోనీ D/O సూర్య నాయక్ 1,00,000

2) భారతి వర్క్/ఓ రాజేష్ నాయక్ 1,00,000


1) జంగం రెడ్డిపల్లి (1) బద్దిపల్లి దేవేంద్రమ్మ 60,000

2) జంగం రెడ్డి పల్లి (2) సతీష్,60,000

3)జంగంరెడ్డిపల్లి (3) బద్దిపల్లి రంగమ్మ 60,000

4)బద్దిపల్లి అచ్యుతారెడ్డి లోకల్ 4,00,000

5) మరికల్ మండలం కన్మనూర్ గ్రామం సందాపురం భాగ్యమ్మకు సీఎంర్ఫ్ ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి 99,000 లబ్ధిదారులకు నర్వ మండల ఎంపీడీఓ శ్రీనివాస్, గ్రామ పంచాయతీ సెక్రెటరీ విష్ణు నర్వ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెన్నయ్య సాగర్, జిల్లా నాయకులు, నర్వ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, జంగం రెడ్డిపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు గ్రామ ప్రజల ఆధ్వర్యంలో ఈ చెక్కుల పంపిణీ చేయడం జరిగింది.



### రంగారెడ్డి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా

## అవార్డు పొందిన విష్ణుమూర్తి

**శుభాకాంక్షలు తెలియజేసిన తలకొండపల్లి జడ్.పి.హెచ్.ఎస్ స్కూల్ చైర్మన్ పెరుమాండ్ల లలితమ్మ**

**షాద్‌నగర్ సెప్టెంబర్ 11(ప్రజాస్వరం):** రంగారెడ్డి జిల్లా సాంఘిక శాస్త్రం ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎన్నికై రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో డీఈవో చేతుల మీదుగా సన్మాన పురస్కారాన్ని అందుకున్న శుభ సందర్భంగా మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. పదర మండలానికి చెందిన విష్ణుమూర్తి ఉపాధ్యాయుడు తలకొండపల్లి జడ్.పి.హెచ్.ఎస్ స్కూల్లో విద్యా బోధనలు విద్యార్థుల జీవితమే తన జీవితం అనుకోని గత 30 సంవత్సరాలుగా విద్యార్థుల భవిష్యత్తు కోసం నిరంతరం కష్టపడుతూ ఎంతోమందిని తన విద్యా బోధనతో ప్రతిభవంతమైన విద్యార్థులను తీర్చిదిద్దిన విష్ణుమూర్తి విద్యా బోధన సేవలను



గుర్తించి ప్రస్తుతం జడ్పిహెచ్ఎస్ తలకొండపల్లి జెడ్పి హెచ్ఎస్ స్కూల్ లో విధులు నిర్వహిస్తూన సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుడు గౌరవప్రదమైన రంగారెడ్డి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన శుభ సందర్భంగా పాఠశాల బృందం, ప్రజలు, విద్యార్థులు, నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు.

## రాయితీపై సోలార్ రూఫ్ టాప్ నిర్మించుకోండి

**పార్లమెంట్ సభ్యులు సిఎం రమేష్.**

**అనకాపల్లి, సెప్టెంబర్ 12(ప్రజాస్వరం):** ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన లాంటి పథకాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు సి ఎం రమేష్ పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా విద్యుత్ కమిటీ సమావేశంలో పార్లమెంట్ సభ్యులు సీఎం రమేష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్లమెంట్ సభ్యులు సీఎం రమేష్ మాట్లాడుతూ ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన పథకం కింద రాయితీపై సోలార్ విద్యుత్ కనెక్షన్లు అందిస్తున్నట్లు తెలిపారు. సోలార్ రూఫ్ టాప్ నిర్మించుకోవడం ద్వారా విద్యుత్ బిల్లులను తగ్గించుకోవచ్చన్నారు. ఈ పథకం వలన గృహ వినియోగదారులకు అతి తక్కువ విద్యుత్ బిల్లు వస్తుందని, ఇంటి కప్పుపై కనీసం 10 చ.మీటర్లు లేదా 100 చ.అడుగుల స్థలం లో సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు. ఒకసారి ఇంటి పైన సోలార్ రూఫ్ టాప్ ను ఏర్పాటు చేసుకోవడం ద్వారా సంవత్సరాల తరబడి దాని నుంచి లబ్ది పొందవచ్చని తెలిపారు. జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ మాట్లాడుతూ ఫీడర్ల సంఖ్య మరింత పెంచాలని , తద్వారా ఓవర్ లోడ్ సమస్యలు తగ్గించేలా చూడాలని ఆదేశించారు. జిల్లాలో వ్యవసాయ, గృహ విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖాధికారులను ఆదేశించారు. పునరుద్ధరించబడు పంపిణీ రంగ పథకం (ఆర్‌డీఎస్ ఎస్)




కింద వ్యవసాయ, వ్యవసాయేతర ఫీడర్ల విభజన, ఓవర్ లోడు ఫీడర్ల విభజన, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు తదితర అంశాలపై విద్యుత్‌శాఖాధికారులతో సమీక్షించారు. వ్యవసాయానికి 9 గంటల పాటు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ అందించాలని, గృహ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సేవలను అందించాలన్నారు. ఆర్‌డీఎస్ఎస్ కింద రూ.111.83 కోట్ల వ్యయంతో వ్యవసాయ ఫీడర్ల నుంచి వ్యవసాయేతర సర్వీసులను వేరుచేసే ఫీడర్ల విభజన కార్యక్రమాల పనులను డిసెంబరులోగా పూర్తి చేసేందుకు నెలవారీ లక్ష్యాలను నిర్దేశించుకోవాలన్నారు. హెచ్‌టీ, ఎల్‌టీ, వ్యవసాయ సర్వీసులు, అధిక సామర్థ్యం ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లకు, ఫీడర్లకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటు పనులను నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేయాలన్నారు. అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ భవిష్యత్ అవసరాల డిమాండ్ మేరకు విద్యుత్ ప్రణాళికలు చేయాలని సూచించారు. సమావేశంలో ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ కుమార్, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు , తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఎస్ఈ జి. ప్రసాద్, ఈఈలు , డీఈ, ఏడీఈ, ఏఈలు పాల్గొన్నారు.

## చంద్రశేఖర్ రెడ్డి పార్థివదేహాన్నికి పూలమాల వేసిన వాకిటి శ్రీహరి

**మక్తల్ ప్రతినిధి సెప్టెంబర్ 12(ప్రజాస్వరం):** కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్త మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసిన మంత్రి మక్తల్ నియోజకవర్గం అమరచింత మండలం నందిమల్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్త అయినటువంటి చంద్రశేఖర్ రెడ్డి అకాల మరణం పట్ల తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తూ ఆయన పార్తివదేవానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక పాడి పరిశ్రమ అభివృద్ధి మస్య క్రీడలు మరియు యువజనుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి కాంగ్రెస్ పార్టీ గీతా సెల్ రాష్ట్ర అధ్యక్షులు కేశం నాగరాజు గౌడ్ తన కార్యకర్త అయినటువంటి చంద్రశేఖర్ రెడ్డి మరణ వార్త వినగానే మంత్రి వాకిటి శ్రీహరి హుటాహుటిన హైదరాబాద్ నుండి నేరుగా మృతిని స్వస్థలమైన నందిమల్ల గ్రామానికి చేరుకొని మృతుని పార్థివదేవాన్ని సందర్శించి పూలమాలలతో వేయడం జరిగింది అనంతరం మృతుని



కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ చంద్రశేఖర్ ఆకస్మిక మరణం నన్ను తీవ్రంగా కలచివేసిందని, చంద్రశేఖర్ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ తరపున నా తరపున అన్ని విధాల సహాయ సహకారాలు ఉంటాయని భరోసనిచ్చారు ఇట్టి కార్యక్రమంలో మంత్రితోపాటు అమరచింత ఆత్మకూరు మండలాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగింది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336,
EDITOR: PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999